
సాక్షి ఒడిశా

గురువారం । 12 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,04,125

బంగారం: 3 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

వెండి: 12 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ

సందడే సందడి



మల్కన్‌గిరి జిల్లాలో మాల్యవాంత్ ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ముందస్తుగా బలిమెల కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్ షో నిర్వహించారు.

- 8లో



ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని కొరాపుట్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మహంతి ప్రశంసించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఘనంగా గీతా హోమం



హోమాన్ని జరిపిస్తున్న అర్చకులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో గీతా జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన హోమ, పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక అశోకా టాకీస్ సమీపంలోని గీతా మందిరంలో సత్యనారాయణ వ్రతం, గీతాపారాయణ కార్యక్రమాలు జరిగాయి.


చంద్రపూర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో రక్తదాన శిబిరాన్ని పోలీస్ యంత్రాంగం మంగళవారం నిర్వహించింది. ఈ శిబిరంలో 38 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పోలీసులు, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ తరహా సేవా కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలని జిల్లా పోలీస్ యంత్రాంగం ఓ ప్రకటనలో కోరింది.

శభాష్ అరుణిమా..



అరుణిమా ఠాకూర్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: సార్వత్రిక న్యాయ ప్రవేశ పరీక్ష (క్లాట్)లో ప్రథమ స్థానంతో ఉత్తీర్ణత సాధించిన అరుణిమా ఠాకూర్‌ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించారు. ముఖ్యమంత్రి నివాసంలో బుధవారం ఆమెని ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. అరుణిమా ఠాకూర్ రౌర్కెలా నివాసి. స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్ర విద్యార్థి. న్యాయ శాస్త్ర రంగంలో అరుణిమా మరెన్నో అత్యున్నత ఫలితాలతో ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

పల్లెశ్రీ మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న గజపతి ఉత్సవాలు-2024కు సంబంధించి పల్లెశ్రీ మేళా పోస్టర్‌ను కలెక్టర్ బిజయకుమార్ దాస్ బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా ఓర్మాస్, మిషన్ శక్తి స్టాల్స్ వంటివి ఏర్పాటుచేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉత్సవాల ప్రచార నిమిత్తం చైతన్య రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, డి.ఆర్.డి.ఎ. ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, బసంత పండా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, డి.పి.ఆర్.ఓ. ప్రదిప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు.



గజపతి ఉత్సవాల ప్రచార రథం ప్రారంభించిన కలెక్టర్

ఈస్ట్‌కోస్ట్‌లో.. వాల్తేరు సెగలు

- తూర్పు కోస్తా రైల్వే నుంచి వాల్తేరు మండలం తొలగింపు
- కేంద్రం నిర్ణయంపై ఒడిశాలో భగ్గుమంటున్న ప్రతిపక్షాలు




ఈస్టుకోస్టు ప్రధాన కార్యాలయం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే పునర్విభజన నేపథ్యంలో ఒడిశాలో అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటులో భాగంగా వాల్తేరు మండలాన్ని తూర్పు కోస్తా రైల్వే జోన్ నుంచి మినహాయించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ చర్యతో ఒడిశాకు తీరని అన్యాయం జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆదాయ రంగంలో అగ్రగామిగా నిలిచిన తూర్పు కోస్తా రైల్వే వెనుకబడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు ప్రాంతీయ ప్రాతిపదికన వాల్తేరు మండలం ఒడిశా అధీనంలో ఉన్న తూర్పు కోస్తా రైల్వే నుంచి తొలగించి ఆంధ్రప్రదేశ్ అధీనంలో ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని విపక్షాలైన బిజూ జనతా దళ్, కాంగ్రెసు పార్టీలు కేంద్రంపై ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ప్రాంతీయ ప్రాతిపదిక ప్రామాణికం కింద పలు ఒడిశా ప్రాంతాలు ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో పని చేస్తున్న ఇతర జోన్ల పరిధిలో ఇమిడి ఉన్నాయి. వాల్తేరు మండలం మినహాయించిన తరహాలో ఒడిశా ప్రాంతాల్ని పొరుగు రాష్ట్రాల జోన్ల నుంచి తొలగించి రాష్ట్ర అధీనంలోకి మళ్లిస్తే రాష్ట్రంలో కూడాకొత్త రైల్వే జోన్ల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. రైల్వే రంగం విస్తరించి ఆదాయం గణనీయంగా పుంజుకుని పలు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

రాయగడతో సర్దుబాటు..

3 మండలాలతో ఒక రైల్వే జోన్‌ప్రామాణికంగా తూర్పు కోస్తా రైల్వే జోన్ నుంచి వాల్తేరు మండలం తొలగించడంతో లోటు తలెత్తకుండా రైల్వే శాఖ కొత్తగా రాయగడ మండలం ఆవిష్కరించింది. ఈ మండలం తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో కొనసాగుతుందని ప్రకటించింది. అంతేకాకుండా వాల్తేరు మండలంలో ఆదాయ వనరులతో తులతూగే కేకే లైన్ వంటి కీలక రైలు మార్గాలు రాయగడ మండలంలో పరిధిలో విలీనం కానున్నట్లు సమాచారం.



వాల్తేర్ డివిజన్

కొత్త రూపం..

రైల్వే శాఖ ప్రతిపాదన ప్రకారం పునర్విభజనతో తూర్పు కోస్తా రైల్వే జోన్ కొత్త రూపు దాల్చుకుంటుంది. ఈ జోన్ పరిధిలో ఇక నుంచి ఖుర్దారోడ్, సంబలపూర్, రాయగడ మండలాలు చలామణి అవుతాయి. ఈ లెక్కన 3 మండలాలు ఒడిశాకు చెందినవిగా ప్రాంతీయ ప్రామాణికతకు పట్టం గడతాయి. రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతాలు ఆగ్నేయ, ఆగ్నేయ మధ్య రైల్వే జోన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. వీటిలో సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బాలాసోర్, మయూర్‌భంజ్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. వీటి భౌగోళిక సరిహద్దులతో ఇతర రాష్ట్రాల జోన్ల నుంచి వేరు చేసి రాష్ట్రం భౌగోళిక సరిహద్దు పరిధిలో విలీనం చేయడంతో రైల్వే శాఖ ప్రామాణికాల ప్రకారం అతి తక్కువగా 6 మండలాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో కొత్తగా మరో 2 జోన్ల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అంచనా.

ప్రతిపక్షాల అభ్యంతరం..

తూర్పు కోస్తా రైల్వే జోన్ పునర్విభజనతో రాష్ట్ర ఆర్థిక, రైల్వే రంగం ప్రాధాన్యత ఏమాత్రం ప్రభావితం కాకుండా జాగ్రత్త వహించకుండా రైల్వే శాఖ రాష్ట్ర ప్రయోజనాలకు నీళ్లొదిలి వాల్తేరు మండలం తొలగించేందుకు సిద్ధం అవుతుందని కాంగ్రెసు, అనుబంధ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకు ప్రయోగించిన ప్రాంతీయ పురోగతి ప్రామాణికం ప్రకారం రాష్ట్రంలో కూడా రైల్వే జోన్ల ఏర్పాటుకు రైల్వే శాఖ ముందుకు రావాలని బిజూ జనతా దళ్ డిమాండ్ చేస్తోంది.

అధికార పక్షం నిర్వీర్యం..

భారత పార్లమెంటులో అత్యధికంగా 20 మంది భారతీయ జనతా పార్టీ ఎంపీలు ఉన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో కొనసాగుతోంది. ఇటువంటి బలమైన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రాబల్యాన్ని నీరుగార్చే రైల్వే శాఖ యోచన పట్ల ఏమాత్రం స్పందించకుండా చోద్యం చూడడం అధికార పక్షం నిర్వీర్యతకు ప్రతీకగా కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనా విమర్శించారు. 2013లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సమయంలో మన్మోహన్ ప్రభుత్వం అలాంటి వాగ్దానం చేయడంతో మంత్రివర్గం నిర్ణయం ప్రకారం ప్రస్తుత కార్యాచరణ కొనసాగుతుందని అధికార పక్షం బీజేపీ సర్దుకునే ప్రయత్నంతో కసరత్తు చేస్తోంది.

రాష్ట్రం నుంచి అంగుళం స్థలం కూడా వదలం

- ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం
- శాసన సభలో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్



శాసనసభలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్: దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు నేపథ్యంలో తూర్పు కోస్తా రైల్వే పునర్విభజన అంశంపై చర్చతో బుధవారం సభ దద్దరిల్లింది. అధికార, విపక్షాలు ఈ అంశంపై ఘాటుగా ప్రతిస్పందించాయి. రాష్ట్ర ప్రయోజనాలకు పక్కన బెట్టి తూర్పు కోస్తా రైల్వే నుంచి వాల్తేరు రైల్వే మండలం తొలగించేందుకు ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయంతో తూర్పు కోస్తా రైల్వేకి ఏటా రూ. 10 వేల కోట్ల ఆదాయానికి గండి పడుతుందని విపక్ష బీజేడీ సీనియర్ సభ్యుడు రణేంద్ర ప్రతాప్ స్వంయి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్వార్థ ప్రయోజనాల కోసం అంకిత భావంతో కృషి చేస్తారనే నమ్మకంతో బీజేడీ సభ్యులు ఓటు వేసి పార్లమెంటుకు అశ్విని వైష్ణవ్‌కు అందలం ఎక్కించారని, ఆయన రైల్వే శాఖకు సారథ్యం వహిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఓటు వేసి పొరబడ్డామనే ఆవేదనతో మనస్తాపానికి గురవుతున్నామని రణేంద్ర ప్రతాప్ స్వంయి ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో రైల్వే రంగం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తుందని, దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో తూర్పు కోస్తా రైల్వే నుంచి వాల్తేరు మండలం తొలగిస్తున్నందున రాయగడ మండలం రూపుదిద్దుకుంటుందని, దీని కోసం రూ. 107 కోట్ల టెండర్లు ఆహ్వానించినట్లు ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ ప్రకటించారు. తూర్పు కోస్తా రైల్వే యథాతథంగా మూడు రైల్వే మండలాలతో కొనసాగుతుందన్నారు. రాష్ట్రం నుంచి ఒక్క అంగుళం స్థలం కూడా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం వాల్తేరు రైల్వే మండలంలో కొనసాగుతున్న కేకే లైను అత్యధిక ఆదాయం చేకూర్చే మార్గంగా వెలుగొందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పరిధిలో కొత్తవలస - కిరండల్ (కేకే) లైను రాయగడ మండలం పరిధిలో విలీనం చేయనున్నామన్నారు. దీంతో తూర్పు కోస్తా రైల్వే జోన్ ఆదాయానికి గండి పడే అవకాశం లేదని స్పష్టం చేశారు. గత కేంద్ర ప్రభుత్వం యూపీఏ నిర్ణయం మేరకు దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందని గుర్తు చేశారు. అప్పట్లో పెదవి విప్పని బిజూ జనతా దళ్ ఇప్పుడు రభస సృష్టించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

చైతీ ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



ముఖ్యమంత్రి మాఝికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాయగడ జిల్లా ఉన్నతాధికారులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న చైతీ ఉత్సవాల్లో పాల్గొవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి జిల్లా యంత్రాంగం ఆహ్వాన పత్రికను అందజేశారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝిలు ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఏడాది చైతీ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే సన్నహాలు ప్రారంభించింది. ఈ క్రమంలో ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించడం మరింత విశిష్టతను సంతరించుకుంది. ఉత్సవాలకు ముఖ్యమంత్రి వచ్చేందుకు అంగీకరించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ విలేకర్లకు తెలిపారు. అలాగే ఉప ముఖ్యమంత్రులు ప్రభాతి పొరిడ, కనకవర్ధన్ సింగ్‌దేవ్‌లు కూడా ఉత్సవాలు హాజరవుతారన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న చైతీ ఉత్సవాలకు ఈసారి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు హాజరుకానుండడం హర్షించదగ్గ విషయమని పట్నాయక్ అన్నారు. అయిదు రోజులు జరగనున్న చైతీ ఉత్సవాలు ఈ నెల 30వ తేదీతో ముగుస్తాయి.

పెళ్లి బృందం వ్యాన్ బోల్తా

- ఇద్దరు మహిళలు దుర్మరణం
- 30 మందికి గాయాలు
- చంద్రగిరి టిటింగి ఘాట్ వద్ద ఘటన



బోల్తాపడిన పికప్ వ్యాన్

పర్లాకిమిడి: జిల్లాలోని మోహానా బ్లాక్ చంద్రగిరి పోలీసుస్టేషన్ పరిధిలో టిటింగ్ ఘాటీ వద్ద పెళ్లి బృందంతో వెళ్తున్న మ్యాక్స్ పికప్ వ్యాన్ బుధవారం ఉదయం పది గంటల సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో 30 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మోహానా ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కెసింగి పంచాయతీ ఘయిబోలి గ్రామం నుంచి 40 మంది పెళ్లి బృందం వివాహ నిశ్చయ వేడుకకు మ్యాక్స్‌పికప్ వ్యాన్‌లో వెళ్తున్నారు. చాంధిపుట్ సమీపం టిటింగి ఘాటీ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో సంఘటన స్థలంలోనే ఒక మహిళ మృతి చెందగా మరో మహిళా చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మృతి చెందినట్టు చంద్రగిరి పోలీసు అధికారులు తెలిపారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

మాటలు తప్ప సాయం శూన్యం

- బీజేడీ పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేడీ పార్టీ నాయకులు

మల్కన్‌గిరి: వర్షాలతో నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని వాగ్దానం చేసిన అధికార బీజేపీ నాయకుల మాటల్లో వాస్తవం లేదని.. ఇప్పటి వరకూ బాధితలకు ఎలాంటి సాయం అందలేదని మల్కన్‌గిరి బీజేడీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానాస్ మడ్కమి అన్నారు. మల్కన్‌గిరి జిల్లాలో వర్షాలు, వరదలతో పంట, ఇళ్లు నష్టపోయిన వారికి నష్టపరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హామీ ఇచ్చి మూడు నెలలు దాటినా ఇంతవరకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు వరదలు వచ్చినప్పుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన టిర్యదర్శి బిష్ణుపద్ సేఠి, ప్రత్యేక సహాయ కమిషనర్ దేవరంజాన్ సింగ్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజాలు జిల్లా యంత్రాగంతో కలిసి చర్చించి.. నష్టాన్ని అంచనా వేసి వారం రోజుల్లో బాధితులకు నష్ట పరిహారం ఇస్తామని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం మాటలు చెప్పడం తప్పితే సాయం చేయడం కనిపించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వరద బాధితులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా బీజేపీ పార్టీ కార్యకర్తలు గోపాల కృష్ణ పండ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమరి టంగులు, మల్కన్‌గిరి వైస్ చైర్‌పర్సన్ కవిత మోహంతి ఉన్నారు.

45 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి సాగును ధ్వంసం చేస్తున్న పోలీసులు



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు, అబ్కారీ సిబ్బంది



దండసేనగుడలో గంజాయి పంట తగలబెడుతున్న అబ్కారీ సిబ్బంది

రాయగడ: జిల్లా పోలీస్ యంత్రాంగం గంజాయి అక్రమసాగుపై నిఘా పెట్టింది. ఇందులో భాగంగా డ్రోన్ల సహాయంతో గంజాయి సాగు ప్రాంతాలను గుర్తించి దానికి అనుగుణంగా దాడులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే జిల్లాలోని పద్మపూర్ సమితి బడపాలి, లికిటిపదర్ అటవీ ప్రాంతాల్లో గంజాయి అక్రమ సాగవుతుందని గుర్తించిన పోలీసులు మంగళవారం అబ్కారీశాఖ సిబ్బంది సహాయంతో విస్తృతంగా ఆయా ప్రాంతాల్లో దాడులు చేపట్టి 15 ఎకరాల విస్తీర్ణంల్లో సాగవుతున్న 45 వేల గంజాయి మొక్కలను కట్ చేసి దగ్ధం చేశారు.

37 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం

జయపురం: కొరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ, జిల్లా అబ్కారీ ఎస్పీ అరుణకుమార్ పాఢీ ఆదేశాల మేరకు జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ గ్రీన్ క్లీన్ నిర్వహించారు. నందపూర్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రథ్ నేతృత్వంలో పోలీసుల సహకారంతో రామగిరి పంచాయతీ దండసేనగుడ, కడకిపాణి ప్రాంతాల్లో 37 ఎకరాలలో గంజాయి పంటను ధ్వంసం చేశారు. మొత్తం 51,800 మొక్కలను తగులబెట్టినట్లు అధికారులు వెల్లడించారు. వీటి విలువ రూ.5 కోట్ల 18 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో బొయిపరిగుడ అబ్కారీ విభాగాధికారి భగవాన్‌మహానందియ, బొయిపరిగుడ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణచంద్ర శెట్టి, ఏఎస్ఐ శివ శంకర నాయిక్, డీబీఎఫ్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

సభ నిరవధిక వాయిదా



సభలో స్పీకరు పోడియాన్ని చుట్టుముట్టిన బీజేడీ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ శీతాకాలం సమావేశాలు నిరవధికంగా వాయిదా వేసినట్లు స్పీకర్ సురమా పాఢి బుధవారం ప్రకటించారు. గతంలో ప్రకటించిన గడువు కంటే 20 రోజులు ముందుగా ఈ సమావేశాలు ముగిశాయి. వాస్తవానికి ఈ నెల 31 వరకు సమావేశాలు కొనసాగాల్సి ఉంది. విపక్షాల ఆందోళనలతో 12 పని దినాలకే అర్ధాంతరంగా ముగించేశారు. ఆర్థిక సంవత్సరానికి అనుబంధ బడ్జెట్‌ని సభలో ప్రవేశపెట్టారు. వాడివేడి అంశాలతో విపక్షాలు ప్రభుత్వాన్ని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టేయడంతో సభా కార్యక్రమాలు అత్యధిక సమయం వాయిదా పడుతూ అతి కష్టంపై ముందుకు సాగాయి. చివరగా మిషన్ శక్తి కార్యకర్తల తీవ్ర ఆందోళనతో సభలో విపత్కర పరిస్థితి నెలకొంది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సభ లోపల, బయట మిషన్ శక్తి కార్యకర్తలకు మద్దతుగా నిలిచింది. ఆందోళనకారులకు మద్దతుగా బిజూ జనతా దళ్ సభ్యులు దిగువ పీఎంజీ కూడలి ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు మిషన్ శక్తి మహిళలు రాత్రింబవళ్ళు నిరసన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తమకు జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని, తక్షణమే హామీ మేరకు జీతాల్ని పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రాత్రి పూటా రోడ్డుపై కొనసాగిన మిషన్ శక్తి మహిళల ఆందోళన



ఆందోళనకారులతో కలిసి బైఠాయించిన బీజేడీ ఎమ్మెల్యే కలికేష్ నారాయణ సింగ్‌దేవ్

క్లుప్తంగా

దేవగిరి మహోత్సవాలు ప్రారంభం


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: గుమ్మాలో బుధవారం సాయంత్రం దేవగిరి మహోత్సవాలను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. ముందుగా గిరిజనులు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలుకుతూ ఎమ్మెల్యేను వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం సవర లోకనృత్యాన్ని కళాకారులు ప్రదర్శించారు. రెండురోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని బి.డి.ఓ. లోకనాథ్ శోబోరో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ అధికారి అంశుమాన్ మహాపాత్రో, డి.ఆర్.డి.ఎ. సి.డి.ఎం. గుణనిధి నాయక్, డి.ఆర్.డి.ఎ. అదనపు అధికారి పృథ్వీరాజ్ మండళ్, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమి మండళ్, పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, గుసాని చైర్మన్ ఎన్. వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు

జయపురం: మెట్రిక్ పరీక్షలు దగ్గర పడుతున్నా సరిపడా ఉపాధ్యాయులు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల కమిటీ సభ్యులు, తలిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు ప్రత్యేక లేఖ రాశారు. 12 గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని, 9,10వ తరగతుల్లో 58 మంది విద్యార్థులకు గాను హెచ్‌ఎంతో కలిసి ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. హెచ్‌ఎం ఎప్పుడు కార్యాలయ పనులతో బిజీగా ఉంటారని, మిగిలిన ఇద్దరిలో ఒకరు మహమ్మద్ అమ్జద్‌ఖాన్ దీర్ఘకాలిక సెలవులో ఉంటారని, మరో ఉపాధ్యాయుడు భగీరథ్ బెహరా వారానికి రెండు రోజులే బడికి వస్తారని తెలిపారు. కలెక్టర్ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు బినోద్ హరిజన్, సభ్యులు ఘెను సాగరియ తదితరులు కోరారు.

కొరాపుట్ రైస్‌మిల్లర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ ప్రతినిధులు

జయపురం: కొరాపుట్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా బి.తిరుపతిరావు, కార్యదర్శిగా గోపాల పండా, ఉపాధ్యక్షులుగా దుర్యోధన పాడి, బి.గోవిందరావు, సంతోష్ కుమార్ సాహు, సహాయ కార్యదర్శులుగా త్రినాథ్ మండల్, ప్రశాంత్ రథ్, కోశాధికారిగా ఎస్.రాజీవ్‌కుమార్, సలహాదారుడిగా పూర్ణచంద్ర పట్నాయిక్, నరేష్ కుమార్ సై్వ, గిరిజాశంకరదాస్, కార్యవర్గ సభ్యులుగా సుధాంశు శేఖర బిశ్వాల్, పి.ఆనందరావు, బాలకృష్ణ పండా, ఆర్.దిలీప్, పి.షణ్ముఖి, సత్యనారాయణ సుబుద్ది, దినేష్ బిశ్వాల్ నియమితులయ్యారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలో ఒక వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్‌ఐ ఇ.చిన్నం నాయుడు బుధవారం తెలియజేశారు. పురపాలక సంఘానికి చెందిన మహిళ భర్త దుబాయ్‌లో వలస కూలీగా పనిచేయడానికి వెళ్లాడు. దీంతో అదృశ్యమైన మహిళ తన తల్లితో కలిసి అదే గ్రామంలో నివాసం ఉంటోంది. కాగా మంగళవారం ఉదయం 5.30 గంటలకి లేచి చూసేసరికి ఇంటి వద్ద కుమార్తె లేకపోవడంతో తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంధువుల ఇళ్ల వద్ద సైతం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సందడే సందడి

మల్కన్‌గిరి జిల్లాలో మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న మాల్యవాంత్ ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం బలిమెల కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్ షో నిర్వహించారు. విద్యార్థులు, యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. యువతులు ముగ్గులు, చిత్రాలు వేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధాన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, డీఐపీఆర్‌ఓ ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు.

– మల్కన్‌గిరి


రహదారిపై ఆదివాసీ చిత్రాలు వేస్తున్న యువతులు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


వేదికపై ఆదివాసీ చిన్నారుల నృత్య ప్రదర్శన


రోడ్‌షో రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధాన్


జూడో ప్రదర్శన


ఆకట్టుకున్న చిత్రాలు


బోదజాతరలో దేవతామూర్తులు తెచ్చే ఘట్టం


పోలీసుల డాగ్‌షో


విలువిద్య ప్రదర్శిస్తున్న యువకులు

మహిళలకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ


జనశిక్షణ్ కేంద్రంలో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు

పర్లాకిమిడి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణతో స్వయం ఉపాధి కల్పిస్తున్నట్టు జన శిక్షణ్ సంస్థాన్ డైరక్టర్ పి.జీవన్‌దాస్ బుధవారం పేర్కొన్నారు. పాతపట్నం రోడ్డులో నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ్ సంస్థాన్ సంస్థ ఇప్పటివరకూ 2021- 2024 వరకూ 3,360 మంది మహిళలకు శిక్షణ కల్పించినట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద వెల్డర్, కార్ డ్రైవింగ్, అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్, జూట్ క్రాఫ్ట్ ప్రోడక్ట్ మేకర్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, ఇతర ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. 15 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. కాశీనగర్ బ్లాక్ రాణిపేట, మోహనా, నువాగడ, ఆర్.ఉదయగిరిలోనూ తమ బ్రాంచిలు ఉన్నాయని తెలిపారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన


వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు


ప్రాజెక్టులను తిలకిస్తున్న అతిథులు


విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

జయపురం: విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని కొరాపుట్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మహంతి ప్రశంసించారు. స్థానిక మోడల్ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చంద్రకళా భగర్తి, స్కూల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, కార్యదర్శి నయన కిశోర్ మహంతి, డైరెక్టర్ కుముద మాలా మహంతి, ప్రిన్సిపాల్ సుప్రియ పాణిగ్రాహి, వైస్ ప్రిన్సిపాల్ సచిదానంద మహాపాత్రో, ఆజచల్ బేగ్, నిరంజన్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు


నడక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు


పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణి


నడక పోటీల్లో పురుషులు

రాయగడ: చైతీ ఉత్సవాల్లో భాగంగా క్రీడా పోటీల్లో బుధవారం నడక పోటీలను నిర్వహించారు. 50 నుంచి 60 ఏళ్లలోపు.. అలాగే 60 ఏళ్ల పైబడిన పురుషులు, స్త్రీల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. సబ్ కలెక్టర్ కళ్యాణిసంఘమిత్రా దేవి, ఈడీఎం భాస్కరరైతా, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయిలు పచ్చ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. స్థానిక కొరాపుట్ కూడలి నుంచి హలువ తోట వరకు సుమారు ఐదు కిల్లోమీటర్లు కొనసాగిన పోటీల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. 60 ఏళ్లలోపు పురుషుల మధ్య జరిగిన పోటీల్లో బిభూతి భూషణ్ రథ ప్రథమ, కె.ఉపేంద్ర నాయుడు ద్వితీయ, సుభాష్ చంద్ర బారిక్ తృతీయ బహుమతులను గెలుపొందారు. అలాగే హరీష్ చంద్ర సాహు, హెచ్‌పీ నల్లలు ప్రొత్సాహక బహుమతులను దక్కించుకున్నారు. అలాగే 60 ఏళ్లలోపు మహిళల విభాగంలో సుజాత మదల ప్రథమ, దొలమణి రత్న చౌదరి ద్వితీయ, సంధ్యారాణి పొలాయి తృతీయ బహుమతులు గెలుచుకోగా.. కె.రజని, కె.సునీతలు ప్రొత్సాహక బహుమతులు దక్కించుకున్నారు. 60 ఏళ్ల పైబడిన వారి విభాగంలో జేకే ప్రధాన్, క్రిష్ణారావు సేనాపతి, బిప్రచరణ్ బ్రహ్మ మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. త్రిపాఠి పండ, శాతంను కుమార్ సాహు, భాస్కర్ ప్రధాన్ లు ప్రొత్సాహక బహుమతులను సాధించుకున్నారు. క్రీడా ఉత్సవాల్లో భాగంగా స్థానిక అంబాగుడ వద్ద గల ఇండోర్ స్టేడియంలో యువతుల మధ్య పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి.

పరిశ్రమలతోనే ప్రగతి



సిబ్బందికి జ్ఞాపిక అందజేస్తున్న ద్వివేది


లాలా కమలపత్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ద్వివేది

రాయగడ: దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవి పరిశ్రమలేనని జేకే పేపర్ మిల్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది అన్నారు. బుధవారం జేకేపూర్‌లో పేపర్‌మిల్ వ్యవస్థాపకుడు లాలా కమలపత్ సింఘానియా 140వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. రాయగడలోని ఆదివాసీలు, హరిజనులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పేపర్ మిల్లును స్థాపించినట్లు చెప్పారు. అనంతరం 25 ఏళ్లగా పని చేస్తున్న ముగ్గురు సిబ్బందికి సన్మానించారు.


కార్యక్రమంలో పాల్గొన్న పేపర్‌మిల్లు సిబ్బంది

ఉద్యోగి వికాస్ శిక్షణ తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న సంతును బెహరా


పాల్గొన్న అభ్యర్థులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిశ్రమల కేంద్ర కార్యాలయంలో ఉద్యోగి వికాస్ శిక్షణ శిబిరాన్ని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సునారాం సింగ్ బుధవారం ప్రారంభించారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐపీవో బిభు స్వయిని, సంతును బెహెరా, అంతర్జాతీయ కార్మిక సంస్థ ట్రైనింగ్ అధికారి నథియల్ పోరిచ్చా, అసిస్టెంటు శిక్షణాధికారి లింగరాజ్ పోరిచ్చా, కుటీర పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ముద్రా, చిన్న, మీడియం తరగతి పరిశ్రమలు నెలకొల్పేందుకు సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు తెలిపారు. శిక్షణ తరగతులు 12 రోజులపాటు జరుగుతాయని జిల్లా పరిశ్రమల అధికారి సునారాం సింగ్ తెలిపారు.

క్లుప్తంగా

మళ్లీ వచ్చిన ఏనుగులు

- పసుకుడి గ్రామంలో సంచరించి పంటల ధ్వంసం



పసుకుడి దగ్గర పంట పొలాల్లో ఏనుగుల గుంపు

భామిని: ఒడిశా నుంచి ఏనుగుల గుంపు మళ్లీ వచ్చింది. భామిని మండలంలోని పసుకుడి గ్రామంలో గల వంశధార నది ఆవల ఒడిశా నుంచి ఏనుగుల గుంపు వచ్చి పంట పొలాలు పాడుచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పసుకుడి నదీతీరంలో ఏనుగుల గుంపు తిష్ఠవేసింది. చేతికి అందాల్సిన మొక్కజొన్న పంటను ఏనుగులు ధ్వంసం చేసి తినివేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. నాలుగు ఏనుగుల గుంపు ఆంధ్రా గ్రామాల్లో పర్యటించి పంటలు ధ్వంసం చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి దాసునాయుడు ఆధ్వర్యంలో ఎలిఫెంట్ ట్రాకర్స్‌తో గ్రామస్తులను అప్రమత్తం చేయడంలో తలమునకలయ్యారు.

పదోన్నతి ఉద్యోగులకు ఉత్తర్వుల అందజేత



పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతి రావడంతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వారికి పదోన్నతి ఉత్తర్వులను బుధవారం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో అందజేశారు. కార్యాలయంలో జూనియర్ సహాయకురాలుగా పని చేస్తున్న కె.విజయను ఈఈ గిరిజన వెల్ఫేర్ కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా పదోన్నతి రాగా, ఎం.నవీన్‌కుమార్‌ను కురుపాం సీనియర్ సహాయకుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

దివ్యాంగ విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత



ల్యాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న డీపీఆర్‌ఓ డి.రమేష్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఆధ్వర్యంలో మెంటాడ మండలం ఆగూరుకు చెందిన దివ్యాంగ విద్యార్థిని గొర్లె నిఖితకు ఉచితంగా ల్యాప్ టాప్ అందజేశారు. రూ.40 వేల విలువ చేసే ఈ పరికరాన్ని దివ్యాంగ విద్యార్థుల విద్యా ప్రోత్సాహంలో భాగంగా జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సిబ్బంది ఈశ్వరరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతారాం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో బుధవారం గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మేదర వీధికి చెందిన బి.సీతారాం పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

సీతంపేట చేరుకున్న యాత్రికుడు

సీతంపేట: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తా సెల్వన్ అనే ప్రపంచ యాత్రికుడు సైకిల్ యాత్ర చేస్తూ బుధవారం సీతంపేటకు చేరుకున్నారు. 2021లో సైకిల్‌పై యాత్రకు బయలు దేరిన ఆయన దేశంలోని వివిధ రాష్ట్రాలు సందర్శించి కొత్తూరు మీదుగా సీతంపేటకు చేరుకున్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025 వరకు తన యాత్ర సాగుతుందని ఆయన తెలిపారు.

శంబర జాతర ఏర్పాట్లపై సమీక్ష

- అధికారులు, కమిటీ సభ్యుల సమన్వయం
- ఆదేశాలు జారీ చేసిన సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: శంబర పోలమాంబ ఉత్సవాలను రాష్ట్ర స్థాయి పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శంబర జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన మక్కువ మండలంలోని శంబర పోలమాంబ జాతర మహోత్సవాలను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జాతర ప్రశాంతంగా సజావుగా జరగాలని అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తులందరూ పోలమాంబను దర్శనం చేసుకోవడానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇందుకోసం అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో అంబులెన్సులు

అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్లేందుకు రహదారి అందుబాటులో ఉండాలని సూచిస్తూ వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మందులు శిబిరాల్లో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేయాలని, అలాగే నిరంతర విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

పారిశుధ్యం పక్కాగా ఉండాలి

పారిశుధ్యం పక్కాగా ఉండాలని, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీల నుంచి కార్మికులు, వాహనాలను జాతర జరిగే ప్రదేశానికి పంపించాలని సూచించారు. జాతర అనంతరం గ్రామంలో పూర్తి స్థాయిలో పారిశుధ్యం నెలకొనాలని స్పష్టం చేశారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు వారంలో ఒక రోజు పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్పష్టంచేశారు. జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, వాహనాల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గం పక్కాగా ఉండాలని సబ్ కలెక్టర్ అన్నారు. జాతర ఉత్సవాలలో స్వచ్ఛంద కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు

జాతరకు సంబంధించిన సమాచారం మైక్‌ల ద్వారా ప్రకటించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమాచారం అందించాలని సూచించారు. మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించేలా స్పీకర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

రవాణా సమస్యలు లేకుండా చర్యలు..

రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు తగిన బస్సులు ఏర్పాటు చేయాలని, ప్రజారవాణా శాఖ అధికారులకు సూచించారు.

756 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు

సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 42 మంది ఎస్‌ఐ లతో సహా మొత్తం 756 మందిని బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని సబ్ కలెక్టర్ అన్నారు. తాగునీటి కుళాయిలు, బోర్లు పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్ధం చేయాలన్నారు.

జాతర నిర్వహణ ఇలా...

ఈ నెల 23న పెద్దమ్మ వారి చాటింపుతో జాతర ప్రారంభమై 2025 ఏప్రిల్ 1వ తేదీన జరిగే చండీహోమం, మహాన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రధానంగా జనవరి 27వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 28న అమ్మవారి సిరిమాను ఉత్సవం, 29న అనుపోత్సవం జరుగుతాయని జిల్లా దేవదాయ అధికారులు చెప్పారు. జనవరి 28వ తేదీ మంగళవారం నుంచి ఏప్రిల్ 1 తేదీ మంగళవారం వరకు మారుజాతర పది వారాలు జరుగు తుందని వివరించారు. సమావేశంలో జిల్లా విపత్తు స్పందన అధికారి కె.శ్రీనివాస బాబు, ఆర్అండ్‌బీ జిల్లా ఈఈ కె.సుబ్బారావు, సాలూరు ఎక్సైజ్ సీఐ జి.దాసు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ పి.ఎం.కె.రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, సాలూరు డిపో మేనేజర్ ఎ.భాస్కర్ రెడ్డి, శంబర మెడికల్ ఆఫీసర్ పి.రమ్య సాయి, మక్కువ మండల రెవెన్యూ అధికారి షేక్ ఇబ్రహీం, మక్కువ మండల ఈఓపీఆర్‌డీ పి.దేవకుమార్, శంబర పోలమాంబ దేవాలయం ఈఓ వీవీ నారాయణ, పోలమాంబ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, శంబర ఎంపీటీసీ తీళ్లపోలినాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళిక షెడ్యూల్ మార్చాలి

- డీఈఓకు జిల్లా హెచ్‌ఎంల అసోసియేషన్ వినతి



వినతిపత్రం అందుకుంటున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన 100 రోజుల ప్రణాళిక షెడ్యూల్‌లో మార్పు చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు బుధవారం డీఈఓ యు.మాణిక్యం నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రణాళిక షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మార్చి 10వ తేదీ వరకు సెలవులు తీసుకోకుండా విరామం లేకుండా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు పాఠశాలలోనే ఉండే విధంగా షెడ్యూల్ ఇచ్చారు. అయితే దీని ప్రభావం విద్యార్థి మానసిక స్థితిపై పడుతుందని వినతిపత్రంలో తెలియజేశారు. హాస్టల్ విద్యార్థులు ఆదివారాల్లో వారి బట్టలు ఉతుక్కోలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ఆదివారాల్లో విద్యార్థుల హాజరుశాతం 50 కన్నా తక్కువగా నమోదవుతుంది. విద్యార్థులకు ఆదివారం పూట ప్రత్యేక తరగతులను రద్దు చేయాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం మండల కేంద్రాల నుంచి తీసుకుని వెళ్లడం ఉపాధ్యాయులకు ప్రయాసగా ఉందని, రెండుపూటల ప్రశ్న పత్రాలను ఒకసారి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.సన్యాసిరాజు, అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

బాలుడి అదృశ్యం



అదృశ్యమైన బాలుడు నందకిషోర్

డెంకాడ: మండలంలోని బొడ్డవలస పంచాయతీ గెడ్డవానిపాలెం గ్రామానికి చెందిన సిడగం నందకిషోర్(14) అదృశ్యమైనట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఈనెల 8వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన నందకిషోర్ తిరిగి రాలేదని చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో డెంకాడ పోలీసులకు బాలుడి తండ్రి పాపునాయుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరికైనా బాలుడి సమాచారం తెలిస్తే సెల్ 9121109446, 9121109428 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఎస్సై సన్యాసినాయుడు కోరారు.

కేసుల రాజీలో మధ్యవర్తిత్వమే కీలకం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: కేసుల రాజీలో మధ్యవర్తిత్వమే కీలకమని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ తెలిపారు. స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యాయవాదులతో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సివిల్ తగాదాలు, భార్యాభర్తల తగాదాలలో మధ్యవర్తిత్వంలోని నియమ నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు పాల్గొన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ క్యూఐపీలో సీతం ఫ్యాకల్టీ ప్రతిభ



ఫ్యాకల్టీ భార్గవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 'ఏఐ, అప్లికేషన్స్' అనే అంశంపై నిర్వహించిన 'ఏఐసీటీఈ-యూఐపీ-పీజీ' ప్రోగ్రామింగ్ కోర్సులో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.భార్గవి ప్రతిభ చూపి కోర్సు పూర్తి చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ టీజీసీతారాం చేతుల మీదుగా ఇటీవల ధ్రువీకరణ పత్రాన్ని ఆమె అందుకున్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో భార్గవిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

కేరళ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం



కార్యక్రమంలో సంఘీభావం తెలుపుతున్న వామపక్షాల నాయకులు

- వామపక్షాల పిలుపు

విజయనగరం ఫూల్‌బాగ్: కేరళ ప్రజలు, ప్రభుత్వానికి అండగా నిలవాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో బుధవారం కేరళ సంఘీభావ సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకర్ రావు మాట్లాడుతూ కేరళ ప్రజల హక్కులు పరిరక్షించాలి, ప్రత్యామ్నాయ వామపక్షాలను బలోపేతం చేయాలనే నినాదంతో దేశవ్యాప్తంగా సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం చేయాలని డిసెంబరు 11న కేరళ సంఘీభావ దినం జరపాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీజేపీయేతర ప్రభుత్వాల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా కేరళలో సీపీఎం నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు, అడ్డంకులు కల్పించిందన్నారు. కేరళకు బీజేపీ ప్రభుత్వం కక్షగట్టి లక్ష కోట్లకు పైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా ఆ రాష్ట్ర అభివృద్ధిని అస్థిర పరిచేందుకు కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. ఈ సంఘీభావ సభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రాములు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్, వి.రాములు, యూఎస్ రవికుమార్, ప్రకాష్, కరీం, సత్యం, రాఘువ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయతో ప్రాణభయం

- చంపేస్తున్న టీబీ వ్యాధి
- జిల్లాలో వందలాది మంది మృతి
- 2024లో నవంబర్ వరకు 2,341 కేసులు నమోదు



జిల్లా క్షయ నివారణ కేంద్రంలో కఫం పరీక్ష చేస్తున్న టెక్నీషియన్



సీబీనాట్ మిషన్‌లో క్షయ వ్యాధినిర్ధారణ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలానికి చెందిన ఓవ్యక్తి క్షయ వ్యాధితో కొంత కాలంగా బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రం అవడంతో మరణించాడు.

☛ విజయనగరం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి ముదిరిపోవడంతో కొద్ది రోజుల క్రితం మరణించాడు. ఇలా వీరిద్దరే జిల్లాలోని అనేక మంది టీబీ వ్యాధితో మృత్యువాత పడుతున్నారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయడం వల్ల చాలా మంది కోలుకోలేకపోతున్నారు. క్షయ వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. క్షయ వ్యాధితో పాటు మొండి క్షయ కేసులు కూడా పెరుగుతున్నాయి. గతంలో టీబీ వ్యాధికి మందులు వాడితే తగ్గిపోయేది. కానీ కొంతమందికి క్షయ వ్యాధి తగ్గకుండా మొండి క్షయగా మారుతోంది. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారికి కఫం పరీక్ష చేస్తారు. కఫంలో క్షయవ్యాధి నిర్ధారణ అయితే రోగులకు డాట్స్ విధానం (ప్రత్యక్ష పర్యవేక్షణ)లో మందులు ఇచ్చేవారు. 6 నుంచి 8 నెలల పాటు మందులు వాడితే క్షయ వ్యాధి తగ్గేపోయేది. కానీ కొంతమందికి 6 నెలలు మందులు వాడినా తగ్గడంలేదు.

మొండిక్షయ రోగుల గుర్తింపు ఇలా..

టీబీ మందులు వాడినా క్షయ వ్యాధి తగ్గని వారిని, టీబీహెచ్ఐవీ రెండు వ్యాధులు ఉన్నవారికి, పూర్తికాలం మందులు వాడినా క్షయవ్యాధి తిరగబెట్టినవారిని మొండిక్షయ అనుమానితులుగా గుర్తించి వారినుంచి శాంపిల్ తీసి సీబీనాట్‌లో పరీక్షించి నిర్ధారిస్తారు. మొండిక్షయ వ్యాధిగ్రస్తులకు రెండేళ్ల పాటు మందులతో పాటు చికిత్స అందిస్తారు.

2023లో 3160 కేసులు నమోదు:

జిల్లాలో 2023లో 43,820 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా 3,160 క్షయ వ్యాధి కేసులు నమోదయ్యాయి 2024 నవంబర్ నెలఖారు వరరకు 49,118 మందిని పరీక్షించగా 2,341 మంది క్షయ వ్యాధి బారిన పడ్డారు. 2023లో క్షయవ్యాధి బారినపడి 149 మంది మరణించగా 2024లో 64 మంది మరణించారు.

మొండి క్షయ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే మందులు

పైరజనమైడ్ మాత్రలు 6 నెలల పాటు వాడాలి. కెనమైసిన్ ఇంజక్షన్ 6 నెలల పాటు వాడాలి. ఇతంబుటల్, ఇతనమైడ్, సైక్లోసెరిన్, లినోప్లాక్సిన్, సైరడాక్సిన్ మాత్రలు 2 రెండేళ్లపాటు వాడాలి.ఈ మందులన్నీ ప్రతిరోజు వేసుకోవాలి.

క్షయ వ్యాధి నిర్మూలనకు అవగాహన

క్షయవ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించడం కోసం 100 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. క్షయవ్యాధి లక్షణాలు ఉన్నవారికి కఫం పరీక్ష చేసి నిర్ధారణ అయిన వారికి చికిత్స ప్రారంభించనున్నాం. క్షయ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుంది.

డాక్టర్ కె.రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి

సారా తయారీ, అమ్మకాలపై నిఘా పెట్టండి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

విజయనగరం క్రైమ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో సారా తయారు చేస్తున్నవారిపైన, అమ్మకాలు చేపట్టే వారిపైన నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎస్.బాబ్జీరావు సూచించారు. ఈ మేరకు స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడారా చెక్‌పోస్ట్ గుండా గంజాయి రవాణా జరగకుండా ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటుచేయాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల కోసం వేలం పాటలు నిర్వహిస్తే కఠినచర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనధికార మద్యం దుకాణాలు ఉంటే కేసులు నమోదుచేయాలని చెప్పారు. ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు చేసే విధంగా చూడాలని, రెస్టారెంట్స్, బార్స్, మద్యం షాపులన్నీ లైసెన్స్ నిబంధనలు పాటించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పి.రామచంద్రరావు, జిల్లా అధికారి బమ్మి డి శ్రీనాథుడు, డిపో మేనేజర్ గౌరీశ్వరరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సంస్కృత కళాశాలలో ఘనంగా గీతాజయంతి



సత్కారం పొందుతున్న గీతాబోధకులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా సంస్కృత కళాశాలలో గీతాజయంతి మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ అధ్యాపకుడు జి.రంగాచార్యులు భగవద్గీతలోని 18 అధ్యాయాల సారాంశాన్ని విద్యార్థులకు వివరించారు. సంస్కృత కళాశాల అధ్యాపకులు టి.రమణ భగవద్గీత విశిష్టతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు మాట్లాడుతూ సర్వమానవాళికి సన్మార్గాన్ని చూపించే సమున్నత గ్రంథం భగవద్గీత అని అన్నారు. అనంతరం పలువురు గీతాబోధకులను కళాశాల ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): చీపురుపల్లి పట్టణంలోని కస్పావీధికి చెందిన ఇప్పిలి జగదీష్ రైలు ఢీకొని మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై మధుసూదనరావు తెలిపారు. బుధవారం రాత్రి 7గంటల సమయంలో మతిస్థిమితం లేకుండా గరివిడిలో తిరుగుతున్న ఆ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మరణించాడన్నారు.

గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి మేదర వీధిలో నివాసముంటున్న పుట్టా చిన్నమ్మడు (55) బుధవారం తన స్వగృహంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటివద్దనే ఈ ఘటన జరగడంతో మృతురాలి కుమారుడు నారాయణరావు అందించిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.ప్రయోగమూర్తి కేసు నమెదు చేశారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడతామని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సేవలకు గుర్తింపు

దత్తిరాజేరు: మండలంలోని సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సేవలకు జాతీయ సాధకుల అవార్డు లభించిందని అధ్యక్షుడు సాయికుమార్ బుధవారం తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న ప్రపంచ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన భారత్ గౌరవ్ అవార్డ్-2024లో యూపీ ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పథక్ అవార్డును ప్రదానం చేసినట్టు వెల్లడించారు.

పెదకుదమలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. వరి ధాన్యం కళ్లాల్లో ఉండ డంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

క్షయవ్యాధిని తరిమికొడదాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ ప్రియ

కొత్తవలస: భారతదేశంలో 2025 సంవత్సరం నాటికి క్షయవ్యాధి లేని సమాజం నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'ని-క్షయ శివిర్' అనే 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ ప్రియ తెలిపారు. క్షయ వ్యాధిపై కంటకాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ని-క్షయ శివిర్' కార్యక్రమం అమలుకు విజయనగరం జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు వెల్లడించారు. వంద రోజుల పాటు క్షయవ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, అనుమానితులకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ప్రతిరోజు కనీసం 25 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీతామహాలక్ష్మి, సిబ్బంది అప్పలకొండ, రమణమ్మ, బేబిరాణి, సూరిదేముడు పాల్గొన్నారు.